

సిద్దిపేటలో బతుకమ్మలతో నిరసన చేపడుతున్న మహిళలు, బీఆర్ఎస్ శ్రేణులు తదితరులు



కామారెడ్డి జిల్లా బాన్సువాడలో తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న నిజామాబాద్ రూరల్ మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్

# ఆడబిడ్డలను అవమానిస్తరా ?

**సన్మానాలకు పురుషులే తప్ప మహిళలు పనికిరారా ● కవులు, కళాకారుల్లో ఆడబిడ్డలకు స్థానం లేదా ? ● బతుకమ్మను తెలంగాణ తల్లి నుంచి దూరం చేయలేరు**

**జీవోలతో భావోద్వేగాలను మార్చలేరు ● ఆశా వర్కర్లకు ఇచ్చిన హామీలు తక్షణమే అమలు చేయాలి ● ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత డిమాండ్**

హైదరాబాద్, డిసెంబర్ 10 (నమస్తే తెలంగాణ): తొమ్మిది మంది కవులు, కళాకారులను సన్మానించడమే కాకుండా వారికి ఇంటి స్థలం, రూ. కోటి ఇస్తామని ముఖ్యమంత్రి ప్రకటించడం సంతోషమే కానీ వారిలో ఒక్క మహిళ కూడా ఎందుకు లేరని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ప్రశ్నించారు. 'విమలక్క, పీవోడబ్ల్యూ సంధ్య, మా భూమి సంధ్య, బెల్లి లలిత, మల్లు స్వరాజ్యం, సదాలక్ష్మి గుర్తుకు లేదా ? అంటూ నిలదీశారు. సచివాలయంలో తెలంగాణ తల్లి విగ్రహం పెట్టినందున మహిళలకు నెలకు రూ.2500 ఇవ్వరా ?' అని ప్రశ్నించారు. పార్టీ పిలుపు మేరకు మంగళవారం ఆమె వందల మంది కార్యకర్తలు, నాయకులతో కలిసి తెలంగాణ భవన్‌లో తెలంగాణ తల్లి విగ్రహానికి పంచామృతాలతో అభిషేకం చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. తెలంగాణ ఆత్మకు ప్రతీక అయిన తెలంగాణ తల్లి రూపాన్ని మార్చి రాష్ట్ర వారసత్వాన్ని రూపుమాపాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణ అస్తిత్వాన్ని, వారసత్వాన్ని, ప్రజల భావోద్వేగాలను కేవలం జీవోతో మార్చలేరని తేల్చిచెప్పారు. తెలంగాణ తల్లి చేతిలో ఉన్న జొన్నలు, మక్కలు తెలంగాణకు ప్రతీక అనటాన్ని ఆక్షేపించారు. ఇతర రాష్ట్రాల్లోనూ అవి పండుతున్నప్పుడు ఈ కొత్త విగ్రహంలో ఏం ప్రత్యేకత ఉన్నదని ప్రశ్నించారు. ప్రపంచంలో మనకు మాత్రమే ప్రత్యేకమైన బతుకమ్మను తెలంగాణ తల్లి నుంచి దూరం చేశారని, ఆ స్థానంలో కాంగ్రెస్ పార్టీ హస్తం గుర్తును పెట్టి ఇదే తెలంగాణ తల్లి అనడం దారుణమని ధ్వజమెత్తారు.



మంగళవారం తెలంగాణ భవన్‌లో తెలంగాణ తల్లికి పంచామృతాలతో అభిషేకం చేస్తున్న ఎమ్మెల్సీ కవిత తదితరులు

### కాంగ్రెస్ తల్లిని తిరస్కరిస్తున్నాం..

'బతుకమ్మను చేతిలో పట్టుకుని ఉన్న తెలంగాణ తల్లి విగ్రహాన్ని మార్చి కాంగ్రెస్ తల్లిని పెట్టుకోవడం వల్ల ప్రజల మనసులు నొచ్చుకున్నాయి. సచివాలయంలో పెట్టిన కాంగ్రెస్ తల్లిని తిరస్కరిస్తున్నాం' అని కవిత పేర్కొన్నారు. తెలంగాణలో ఉద్యమకారులతో పెట్టుకున్న ఎవ్వరూ బాగుపడలేదని, ఈ విషయాన్ని చంద్రబాబు నాయుడును అడిగి తెలుసుకోవాలని సీఎంకు సూచించారు.

### ఆశాల హామీలు తక్షణమే అమలు చేయాలి

ఆశా వర్కర్లకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని ఎమ్మెల్సీ కవిత డిమాండ్ చేశారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఆశా వర్కర్లను గౌరవంగా ప్రగతిభవన్‌కు పిలిపించి మాట్లాడి వారి వేతనాలను పెంచారని, ఇప్పుడు రేవంత్‌రెడ్డి వారిమీద దాష్టికం ప్రదర్శిస్తున్నారని మండిపడ్డారు. ఒక పక్క పేదతల్లి విగ్రహాన్ని పెట్టామని చెబుతున్న సీఎం రేవంత్‌రెడ్డి ఆశా వర్కర్ల మీద దౌర్జన్యం చేశారని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో మాజీ మంత్రి కొప్పుల, మాజీ ఎమ్మెల్యే ఆనంద్, రాష్ట్ర కార్పొరేషన్ మాజీ చైర్మన్లు అయాచితం శ్రీధర్, దేవీప్రసాద్, మేడే రాజీవ్‌సాగర్, పల్లె రవి, గెల్లు శ్రీనివాస్ యాదవ్ పాల్గొన్నారు.



జనగామ జిల్లా దేవరుప్పుల మండలం సీతారాంపురంలో తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, స్థానిక నేతలు



మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని తెలంగాణ చౌరస్తాలో తెలంగాణ తల్లి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, బీఆర్ఎస్ నాయకులు తదితరులు




మంచిర్యాలలో తెలంగాణ తల్లి విగ్రహానికి నమస్కరిస్తున్న దివాకర్‌రావు



కొత్తగూడెంలో తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న మాజీమంత్రి వనమా



ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేస్తున్న మాజీ మంత్రి జోగురామన్న, బీఆర్ఎస్ నాయకులు, మహిళలు



సూర్యాపేటలో తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న మాజీ ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, బీఆర్ఎస్ నాయకులు తదితరులు




నారాయణపేట జిల్లా మక్తల్‌లో తెలంగాణ తల్లి ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు తదితరులు



కరీంనగర్ జిల్లా కేంద్రంలోని వన్ టౌన్ పోలీస్‌స్టేషన్ చౌరస్తాలో తెలంగాణ తల్లి ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు తదితరులు



సిద్దిపేట జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో నిర్వహించిన నిరసనలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్

# బతుకమ్మలేని తల్లిని ఊహించలేం

- సీఎంకు మన సంస్కృతి తెల్వదు
- మాజీ మంత్రి ఎర్రబెల్లి ఫైర్
- తలరాత మార్చాలి: శ్రీనివాస్‌గౌడ్
- మనోభావాలు దెబ్బ తీశారు: జోగు
- విగ్రహం రూపురేఖల మార్పుపై బీఆర్ఎస్ శ్రేణుల మండిపాటు
- తెలంగాణ తల్లికి క్షీరాభిషేకాలు

నమస్తే నెట్‌వర్క్, డిసెంబర్ 10: బతుకమ్మ లేని తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఊహించలేమని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. తెలంగాణ తల్లి విగ్రహ రూపురేఖలు మార్చడాన్ని నిరసిస్తూ కేటీఆర్ పిలుపు మేరకు మంగళవారం రాష్ట్రవ్యాప్తంగా బీఆర్ఎస్ శ్రేణులు తెలంగాణ తల్లి విగ్రహాలకు క్షీరాభిషేకాలు చేశారు. జనగామ జిల్లా దేవరుప్పుల మండలం సీతారాంపురం, పాలకుర్తి మండలం దర్దేపల్లి, కొడకండ్ల గ్రామాల్లో ఎర్రబెల్లి దయాకర్‌రావు తెలంగాణ తల్లి విగ్రహాలకు క్షీరాభిషేకం చేశారు. ఖిలావరంగల్‌లో మాజీ ఎమ్మెల్యే నరేందర్, మహబూబాబాద్‌లో మాజీ ఎమ్మెల్యే శంకర్‌నాయక్, లింగాలఘనపురంలో మాజీ ఎమ్మెల్యే రాజయ్య పాల్గొన్నారు. మహబూబ్‌నగర్ తెలంగాణ చౌరస్తాలో మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ క్షీరాభిషేకం చేయగా.. మక్తల్, మదనాపురంలో మాజీ ఎమ్మెల్యేలు రామ్మోహన్‌రెడ్డి, ఆల వెంకటేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ.. మార్పు అంటే ప్రజల తలరాతలు మార్చాలని సూచించారు.

**రేవంత్.. నిన్ను చరిత్ర క్షమించదు: దేశపతి**

తెలంగాణ తల్లిని అవమానపరిచిన సీఎం రేవంత్‌రెడ్డిని చరిత్ర క్షమించదని ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ మండిపడ్డారు. సిద్దిపేటలోని అంబేద్కర్ చౌరస్తాలో చేపట్టిన నిరసనలో ఆయన మాట్లాడారు. మెదక్ బీఆర్ఎస్ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే పద్మా దేవేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి తెలంగాణ తల్లి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. భద్రాద్రి జిల్లా కొత్తగూడెంలో మాజీ మంత్రి వనమా, అశ్వారావుపేటలో మాజీ ఎమ్మెల్యే నాగేశ్వరరావు, మధిరలో జడ్పీ మాజీ చైర్మన్ కమల్‌రాజు తెలంగాణ తల్లి విగ్రహాలకు క్షీరాభిషేకం చేశారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు, నగర మేయర్ సునీల్‌రావు, గన్నేరువరం మండలంలో మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, రామడుగు మండలం తిరుమలాపూర్‌లో మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలం నమిలకొండలో చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, రాయికల్‌లో జడ్పీ మాజీ చైర్‌పర్సన్ వసంత తెలంగాణతల్లి విగ్రహాలను పాలతో అభిషేకించారు. యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలం గుండ్లగూడెంలో మాజీ విప్ సునీతామహేందర్‌రెడ్డి, భువనగిరిలో మాజీ ఎమ్మెల్యే శేఖర్‌రెడ్డి, చౌటుప్పల్‌లో మునుగోడు మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి, నల్లగొండ జిల్లా నందికొండలో మాజీ ఎమ్మెల్యే భగత్, మిర్యాలగూడలో మాజీ ఎమ్మెల్యే భాస్కర్‌రావు, సూర్యాపేటలో మాజీ ఎంపీ లింగయ్య తెలంగాణ తల్లి విగ్రహాలకు క్షీరాభిషేకం చేశారు. ఆదిలాబాద్‌లో మాజీ మంత్రి జోగు రామన్న మాట్లాడుతూ.. రేవంత్‌రెడ్డి తెలంగాణ ప్రజల మనోభావాలు దెబ్బ తీశారని మండిపడ్డారు. నిజామాబాద్‌లో మాజీ ఎమ్మెల్సీ వీజీగౌడ్, కామారెడ్డి జిల్లా సదాశివనగర్ మండలం వజ్జెపల్లి తండాలో మాజీ ఎమ్మెల్యే సురేందర్, బిచ్కుందలో జుక్కల్ మాజీ ఎమ్మెల్యే షిండే, బాన్సువాడలో నిజామాబాద్ రూరల్ మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ క్షీరాభిషేకం చేశారు.

## తెలంగాణను కించపర్చేలాపోస్టులు

**పోలీసులకు కార్తీక్‌రెడ్డి ఫిర్యాదు**



బంజారాహిల్స్, డిసెంబర్ 10: తెలంగాణను కించపరుస్తూ సోషల్ మీడియాలో పోస్టులు పెట్టడంతోపాటు ప్రజల మధ్య వైషమ్యాలు పెంచేందుకు ప్రయత్నిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ నేత పటోళ్ల కార్తీక్‌రెడ్డి మంగళవారం బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోస్టులకు సంబంధించిన వివరాలను అందజేశారు. తెలంగాణ పేరు, చిహ్నాలను కించపర్చేలా వ్యాఖ్యలు చేస్తున్నవారిపై చర్యలు చేపట్టాలని కోరారు.



స్మారక చిహ్నం ప్రాంగణంలో పసిడి తెలంగాణ తల్లి విగ్రహం వద్ద ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి

# బంగారు తెలంగాణ తల్లి కనబడట్లేదా?

- **మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి**

హైదరాబాద్, డిసెంబర్ 10 (నమస్తే తెలంగాణ): అమరుల స్మారక చిహ్నం వద్ద కేసీఆర్ అధికారికంగా ఆవిష్కరించిన తెలంగాణ తల్లి పసిడి విగ్రహం సీఎం, మంత్రులకు కనబడట్లేదా? అని మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి ప్రశ్నించారు. పదేళ్లలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఎక్కడా అధికారికంగా ఆవిష్కరించలేదంటున్న కాంగ్రెస్ నేతలకు మంగళవారం ఆయన ఎక్స్ వేదికగా కౌంటర్ ఇచ్చారు. అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ తెలంగాణ తల్లి దీవెనలతో పసిడి తెలంగాణగా విరజిల్లాలని 2023 జూన్ 22న కేసీఆర్ అధికారికంగా ఆవిష్కరించారని గుర్తు చేశారు. హుస్సేన్‌సాగర్ తీరాన అమరుల స్మారక చిహ్నం ప్రాంగణంలో కొలువు దీరిన పసిడివర్ణ తెలంగాణతల్లి విగ్రహమే దానికి నిలువెత్తు సాక్ష్యమని స్పష్టం చేశారు.

# కాంగ్రెస్ గుర్తు ప్రచారానికే కొత్త తల్లి

**సమైక్య బాస్‌ల మెప్పు కోసం మన సంస్కృతిపై దాడి: జగదీశ్‌రెడ్డి**



హైదరాబాద్, డిసెంబర్ 10 (నమస్తేతెలంగాణ): కాంగ్రెస్ గుర్తు ప్రచారానికే కొత్త తెలంగాణ తల్లి విగ్రహాన్ని సృష్టించారు.. సమైక్య బాస్‌ల మెప్పు కోసమే కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ సంస్కృతిపై దాడి చేస్తున్నది.. ప్రజాపాలన విజయోత్సవాల పేరిట నిర్వహించిన సంబురాల్లో సినిమా పాటలతో మన అస్తిత్వాన్ని మంటగలిపారు..' అని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. మంగళవారం తెలంగాణ భవన్‌లో ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు బాల్క సుమన్, మెతుకు ఆనంద్, మన్నె గోవర్ధన్‌రెడ్డితో కలిసి మాట్లాడారు. ఉవ్వెత్తున ఎగిసిన ఉద్యమం నుంచి పుట్టిన భౌతికరూపమే తెలంగాణ తల్లి అని అభివర్ణించారు. రేవంత్‌రెడ్డి.. జీవోలు, గెజిట్లు, అధికారికమంటూ హస్తం గుర్తు విగ్రహాన్ని తయారుచేసి ఉత్సవాలు చేసుకోవడం సిగ్గుచేటని దుయ్యబట్టారు.

**తెలంగాణ తల్లికి గెజిటా?**

'కోట్లాది మంది ఆకాంక్షల నుంచి జనించిన ఆ స్వరూపానికి జీవో ఎందుకు? గెజిట్ ఎందుకు? రేవంత్‌రెడ్డికి ఇంగితజ్ఞానం లేకుంటే అధికారులకైనా ఉండొద్దా? మేం గతంలో ఏనాడైనా ఇలా వ్యవహరించామా?' అంటూ జగదీశ్‌రెడ్డి ప్రశ్నల వర్షం కురిపించారు. ప్రజల మెడపై కత్తిపెట్టి కొత్త తల్లిని ఆరాధించమని అడిగే హక్కు ఎవరికీ లేదని హెచ్చరించారు. కోయిలలు ఉన్నచోట కాకిలా ప్రవర్తించి దృష్టిని ఆకర్షించేందుకే సీఎం రేవంత్‌రెడ్డి మూర్ఖంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు.